క్లుప్తంగా

ఎమ్మెల్యే చొరవతో పాఠశాలకు వాచ్‌మెన్ నియామకం



సమావేశమైన కమిటీ సభ్యులు

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామ జెడ్పీ పాఠశాల మధ్యాహ్న భోజన వంట నిర్వాహకురాలు మల్లిపెద్ది రమ విధులు నిర్వహిస్తూ అగ్ని ప్రమాదానికి గురై ఇటీవల మరణించారు. దీంతో ఆమె కుటుంబానికి అండగా నిలవాలనే ఎమ్మెల్యే రెడ్డిశాంతి ఆలోచన మేరకు కుమారుడు హేమంత్‌ను పాఠశాలకు నైట్ వాచ్‌మెన్‌గా నియమించేందుకు స్కూల్ కమిటీ శుక్రవారం సమావేశమై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడు తాళాభత్తుల ప్రసాదరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రెడ్డిశాంతికి మల్లిపెద్ది రమ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

127 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: బోరుభద్ర గ్రామంలోని యూపీ పాఠశాల వద్ద బైదలాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 127 మందికి వైద్యుడు ఐ.శ్రీధర్ వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి, శ్రీనివాసరావు, బాబూరావు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనాలి



మాట్లాడుతున్న ప్రవల్లికా ప్రియ

సారవకోట: రేషన్ పంపిణీలో వలంటీర్లు తప్పనిసరిగా పాల్గొవాలని తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో రేషన్ డీలర్లు, బియ్యం వాహనాల సిబ్బంది, వలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బియ్యం పంపిణీ సమయంలో వలంటీర్లు పాల్గొవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సీఎస్‌డీటీ గణేష్ ఉన్నారు.

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం



చెరువు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ జీవి రమణి

జలుమూరు: అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జోనంకి పంచాయతీ సర్పంచ్ జీవి రమణి అన్నారు. తన సొంత నిధులతో గ్రామంలోని పల్లెడు చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో గంగాదరపేట చెరువు, రచ్చబండ నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధి పనులను తన సోదరుడు ఐఆర్ఎస్ పూజారి కృష్ణ, భర్త జీవి రమణతోపాటు కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో చేపట్టామన్నారు. ప్రభుత్వ పరంగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సహకారం మరువలేమన్నారు. అలాగే వైఎస్సార్ క్లినిక్ కోసం విలువైన స్థలాన్ని తన అత్తమామల పేరిట దానం చేశామన్నారు. పంచాయతి అభివృద్ధి కోసం సొంత నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

- పీడీ చిట్టిరాజు



వేతనదారులతో చిట్టిరాజు

జలుమూరు: ఉపాధి హామీ పథకం పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. గుగ్గిలి గ్రామంలో వేతనదారులతో శుక్రవారం మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడంతో పాటు వలసల నివారణే పథకం ముఖ్య లక్ష్యమన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా నిర్దేశించిన సమయాల్లో పనులు చేయాలని సూచించారు. ఏపీవోలు సత్యమూర్తి, పట్ట సోమేశ్వరరావు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- కట్యాచార్యులపేటలో గ్రామ సచివాలయం ప్రారంభం

ఆమదాలవలస రూరల్: సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ప్రజా సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత దేశంలోనే ప్రథమస్థానం ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. కట్యాచార్యులపేటలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలనే భావనతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పరిపాలనను తీసుకువచ్చి గ్రామ సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలు చేయని గ్రామ వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి ఇంటి వద్దకే అన్ని సేవలు చేరువ చేస్తున్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అనునిత్యం సేవలు అందించడంతో పాటు ఆధునిక వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గతంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కావాలంటే రైతులు మండల కేంద్రాలకు వెళ్లి పడిగాపులు పడి, పోలీసులతో లాఠీ దెబ్బలు తినాల్సి వచ్చేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇంటి వద్దకే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేదల చదువులకు భరోసా కల్పించారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు కలిస్తున్నారన్నారు. జలజీవన్ పథకంలో భాగంగా రూ. 235 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్టు స్పీకర్ పేర్కొన్నారు. కలుషిత నీటిని తాగడం వలన రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో రహదారులు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ముందుండాలన్నారు. ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే దిశగా అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం వలన అవినీతిరహిత పాలన సాగుతోందన్నారు. గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి తక్షణమే సంక్షేమ పథకాలు అందించాలని సిబ్బందికి సూచించారు. సమస్యలుంటే తక్షణమే పరిష్కరించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, చిలకపల్లి సురేష్, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పీఏసీఎస్ చైర్మన్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు అంబటి సత్యనారాయణ, తిర్లంగి రామారావు, మెట్ట ఆనందరావు, తమ్మినేని వేణు, మామిడి ఢిల్లేశ్వరరావు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కె.చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లుకలాం పాఠశాలను సందర్శించిన డీఈవో



వంట ఏజెన్సీ మహిళలకు సూచనలు చేస్తున్న తిరుమల చైతన్య

నరసన్నపేట: లుకలాం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎ.తిరుమల చైతన్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉదయానికే స్కూల్‌కు చేరుకొని ఉపాధ్యాయుల హాజరుతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్ఏ–2 పరీక్షలు నిబంధనల మేరకు నిర్వహించి..శుక్రవారంతో సజావుగా పూర్తి చేశామన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పథకం పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వేసవి సెలవుల్లో పనులు వేగవంతంగా నిర్వహించాలని స్కూల్ కమిటీ ప్రతినిధులను కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించి.. వంట ఏజెన్సీ మహిళలకు పలు సూచనలు చేశారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: వ్యక్తిగత పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఐఆర్‌పీడబ్ల్యూఏ మండల ప్రతినిధి బోయిన వెంకటరమణ అన్నారు. కరగాంలో పాఠశాల విద్యార్థులతో గ్రామంలో పరిశుభ్రతంపై ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అనంతరం స్కూల్లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేతుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రక్త హీనత, నులిపురుగులు నివారణపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుమలరావు, ఉపాధ్యాయిని వాన సుమతి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో ఆనందం



మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- శాసనసభాపతి తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం వ్యక్తమవుతోందని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' దోహదపడుతోందన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి ఎనిమిదో వార్డు గేటు, మేదర వీధి, లెప్రర్సీ కాలనీల్లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి జగన్ సర్కార్ చేసిందన్నారు. అందుకే ధైర్యంగా ప్రజల వద్దకు రాగలుగుతున్నామన్నారు. జవాబుదారీతనంతో కూడిన పాలన రాష్ట్రంలో జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయే పథకాలను చేరువ చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాల నాయకులు లేనిపోని అపోహలు ప్రజల్లో కల్పిస్తూ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిని నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని జనం ఇప్పటికే నిర్ణయానికి వచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.రమణమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.శ్యాంప్రసాద్, పార్టీ నాయకులు బి.రవికుమార్, మామిడి ప్రభాకరరావు, ఎం.శ్రీనివాసరావు, రమేష్, పొన్నాడ చిన్నారావు, బి.వి.రమణమూర్తి, చక్రధరరావు, రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీది ప్రజావ్యతిరేక పాలన



ర్యాలీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజావ్యతిరేక పాలన చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.తులసీదాస్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన ప్రచారభేరి ముగింపు కార్యక్రమం కొత్తూరులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనను విరమించాలన్నారు. కార్యక్రమములో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు, నాయకులు నిమ్మక అప్పన్న, అప్పారావు, రాంబాబు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సత్కారం

సరుబుజ్జిలి: వృత్తిపట్ల అంకిత భావం ఉంటే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీపీ కిల్లి రమాదేవి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన తిరుమలరావును శుక్రవారం కార్యాలయంలో సత్కరించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కేవీజీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుడు మృతికి సంతాపం



దివాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ మృతికి నరసన్నపేట శిష్టకరణ సంఘం సభ్యులు సంతాపం తెలియజేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దివాకర్ సేవలను సంఘం అధ్యక్షుడు సదాశివుని కృష్ణ కొనియాడారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎస్.ప్రభాకరరావు, ఎంఈవీజే మోహనరావు, వసంత కుమార్, డీవీ రఘు పాల్గొన్నారు.

ఊరూరా 'మా నమ్మకం నువ్వే జగన్'

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిపై నిర్వహిస్తున్న ప్రజా సర్వేకు జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది. 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం పేరిట ఇంటింటికీ వెళ్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజలు ఘనంగా ఆహ్వానం పలుకుతున్నారు. మండటిండలో కూడా శుక్రవారం పలు గ్రామాల్లో కార్యక్రమం సాగింది.



ఆమదాలవలస: గేదెలవానిపేటలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సాధు కామేశ్వరరావు తదితరులు



కొత్తూరు: నేరడి పంచాయతీ పరిధి జోగిపాడులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సారవకోట: మర్రిపాడులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నాయకుడు బొడ్డేపల్లి సుధాకర్



ఎల్.ఎన్.పేట:చిన్నకొల్లివలస పునరావాస కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతిలక్ష్మి



నరసన్నపేటలోని ఇందిరానగర్ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కిన్నెరవాడలో రేపటి నుంచి గ్రామదేవత ఉత్సవం



చెవిటమ్మ తల్లి ఆలయం



సిద్ధం చేసిన రథం

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు గామ దేవత చెవిటమ్మతల్లి సిరిమాను ఉత్సవాలు జరగనున్నాయి. 14 ఏళ్ల తరువాత జరుగుతున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వలస వెళ్లిన కుటుంబాలు గ్రామానికి చేరుకుంటున్నాయి. తొలి రోజున దేవరను తెచ్చే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభవవుతాయి. వచ్చే నెల ఒకటో తేదీన 40 అడుగుల సిరిమానును జలుమూరు మండలం కత్తిరివానిపేట నుంచి ప్రత్యేక పూజలు చేసి భుజాలపై మోసుకుంటూ గ్రామస్తులు, భక్తులు తీసుకొస్తారు. రెండో తేదీన గ్రామానికి చెందిన పూజారి మెండ దాలప్పన్న సిరుమానును అధిరోహించగా.. తిరువీధి నిర్వహించనున్నారు. భక్తుల సహకారంతో లక్ష రూపాయలు వెచ్చించి రథం తయారు చేశారు. పారిశుద్ధ్యం క్షీణించకుండా ఇప్పటికే మురుగు నీటి కాలువల్లో పూడికలు తొలగించారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పంచిరెడ్డి పద్మావతి చెప్పారు. 14 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఉత్సవానికి సుమారు లక్ష మంది హాజరయ్యే అవకాశం ఉందని కమిటీ సభ్యుడు సూర్యానారాయణ చెప్పారు.

సమావేశాలకు హాజరుకాకపోతే చర్యలు

- మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు



సమస్యలపై చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

సరుబుజ్జిలి: సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు అన్నారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ముందుగా శాఖల వారీగా చర్చ నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యంతో వంశధార ప్రధాన, పిల్లకాలువలు అధ్వానంగా మారడంతో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. చాలాచోట్ల షట్టర్లు, చెక్‌డ్యామ్‌లు శిథిలమైనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు సమావేశాలకు హాజరుకాకుండా వర్క్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగులను పంపించడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహించారు. పశువులకు సకాలంలో బీమా మంజూరు కావడంలేదని సభ్యులు అన్నారు. వెన్నెవలస ఆశ్రమపాఠశాల భవనం పనులు పూర్తికాక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బెవర కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ ఆనందరావు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



విద్యార్థుల నృత్యప్రదర్శన

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు కూడా కృషి చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. కామేశ్వరిపేట పంచాయతీ కొల్లవానిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాడు– నేడు' పథకంతో పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులు ఎల్.సాహిత్య, ఎ.కీర్తిక, కె.బాలాజీ, జి.వేగనందన, జశ్వంత్ ప్రదర్శించిన 'నేను బడికి పోతా' నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.అచ్యుతరావు, నడగాం, నరసింగరాయుడుపేట, బసివలస, అంబాజీపేట పాఠశాలల ఉపాధ్యాయులు నరసింహమూర్తి, జగదీశ్వరరావు, బి.కాశీవిశ్వనాథ్ తదితులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు: గులివిందలపేట ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఉత్సాహంగా జరిగింది. సర్పంచ్ గందవరపు ఈశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణలు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు సమకూరుతున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్‌కమిటీ చైర్మన్ సూర్యనారాయణలు దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

సంక్షిప్తంగా..

ప్రభుత్వ కాలేజీలో చేర్పించాలని ప్రచారం



విద్యార్థినికి కరపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఎల్.ఎన్.పేట: ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పిల్లలను తల్లిదండ్రులు చేర్పించాలని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు కోరారు. ప్రథమ సంవత్సరంలో విద్యార్థులను చేర్పించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అధ్యాపక బృందంతో కలిసి ప్రచారం చేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి తమ కళాశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. నిపుణులైన అధ్యాపకులతో బోధన చేస్తామన్నారు. కరపత్రాలను పంచిపెట్టారు.

మేడేను విజయవంతం చేయాలి

సరుబుజ్జిలి: మేడేను విజయంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సులు, ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు అదపాక రాజేష్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చంద్రకుమారి

మెళియాపుట్టి: నిబంధనల మేరకు పనులు చేయడం ద్వారా ఉపాధి వేతనదారులకు అధిక వేతనం గిట్టుబాటవుతోందని ఎంపీడీవో చంద్రకుమారి అన్నారు. మర్రిపాడు–సి పంచాయతీ బంజీరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ద్వారా వేతనదారుల హాజరు వేయాలని మేట్లకు సూచించారు. ఈసీ ఆదినారాయణరెడ్డి, సాంకేతిక సహాయకుడు రవి, ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలం ఉన్నారు.

వర్షంతో ఊరట



మెళియాపుట్టిలో కురుస్తున్న వర్షం

మెళియాపుట్టి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో కొద్దిరోజులుగా ఎండతో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. సుమారు గంటపాటు కురిసిన వర్షం ఖరీఫ్ వ్యవసాయ పనులకు మేలుచేస్తోందని రైతులు చెబుతున్నారు. చాపర, పెద్దపద్మాపురం, మర్రిపాడుసి, పట్టుపురం తదితర గ్రామాల్లో వర్షం పడింది.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు!

సారవకోట: కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న తన కుమారుడు రాజాపు మహీధర్‌ను ఉపాధ్యాయుడు మార్పు అశోక్ వీపుపై వాచినట్లు కొట్టారని విద్యార్థి తండ్రి పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో నలుగురు విద్యార్థులతో మాట్లాడుకుంటుండగా తన కుమారుడ్ని కొట్టినట్టు పేర్కొన్నారు. ఇంటికి వచ్చి ఇబ్బంది పడుడంతో ఏం జరిగిందో తెలుకొని సారవకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుడు వద్ద ప్రస్తావించగా పిల్లలు మధ్యాహ్న భోజనానికి వెళ్లకపోవడంతో చేతితో కొట్టానన్నారు. ఉద్దేశ పూర్వకంగా కొట్టలేదని స్పష్టం చేశారు.

సర్పంచ్ ఉదారత

బూర్జ: కాలపర్తి పంచాయతీ సర్పంచ్ బిర్లంగి వరహాలునాయుడు ఉదారత చాటుకున్నారు. పోతినాయుడు చెరువుకు సొంత నిధులతో గట్టుకు శుక్రవారం మదుములు వేయించారు. ఆయకట్టుకు సాగునీటి అందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన సిమెంటు మదుములు వేయించి సమస్య పరిష్కరించారు.

జగనన్న కాలనీ పరిశీలన

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీ పనులను మెళియాపుట్టి మండల సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి పోలాకి జయమునిరావు శుక్రవారం పరిశీలించారు. ఇళ్లను సక్రమంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రతిఒక్కరి సొంతింటి కలను ముఖ్యమంత్రి వైజగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. స్థానిక నాయకుడు పరపటి యోగి ఉన్నారు.